క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శివమాల ధారణ

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు మహాశివరాత్రి రోజున ఇరుముడి సమర్పించేందుకు భక్తులు ఆదివారం పలు శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో శివ మాలాధారణ చేపట్టారు. పట్టణంలోని పాత,కొత్త శివాలయాల్లో ఆదివారం శుభదినం కావడంతో శివ మాలాధారణకు భక్తులు ఆసక్తి చూపారు. కాగా సోమవారం అధిక సంఖ్యలో దీక్ష స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

మిడుతూరు: రైతులు పొలాల్లో సాగు చేసిన పంట వివరాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ సూచించారు. ఈ క్రాప్ నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవని చెప్పారు. ప్రతి రైతు తప్పనిసరిగా క్రాప్ నమోదు చేయించుకునేలా చైతన్యం తీసుకురావాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సూచించారు.

బొల్లవరం నుంచి ఎమ్మెల్యే పాదయాత్ర

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ బొల్లవరం గ్రామం నుంచి నందికొట్కూరు పార్టీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం 9.30గంటలకు బొల్లవరంలో పాదయాత్ర ప్రారంభించి 10.30 గంటలకు అల్లూరు రోడ్డులోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తారు. 11 గంటలకు పార్టీ కార్యాలయంలో కేక్‌కట్‌చేసి విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పీఏ ప్రభాకర్ తెలిపారు. అనంతరం ఒంటి గంటకు పట్టణంలోని నిరాశ్రయుల వసతిగృహంలో మధ్యాహ్న భోజనం పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలపాలన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ పుస్తకపఠనం అలవర్చుకోవాలని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, నీతికథల పుస్తకాలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవితచరిత్రల పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను చదివించారు.

తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు 650 క్యూసెక్కుల నీరు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలోమీటరు లాకీస్లా నుంచి ఆదివారం తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. సుంకేసుల రిజర్వాయర్ నుంచి 800 క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్‌కు ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి కేవలం ఒక్క మోటారు ద్వారా 340 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదలవుతున్నట్లు చెప్పారు. నిప్పులవాగుకు నీటి విడుదల పూర్తిగా నిలుపుదల చేశామని వివరించారు.

13న సంక్రాంతి ముగ్గుల పోటీలు

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 13న మండలంలోని వడ్డెమాను గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏవీఐఎఫ్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరీదేవి, చైర్మన్ నాగముని తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వడ్డెమాను సమీప గ్రామాలైన కోనేటమ్మపల్లి, వడ్డెమాను, అల్లూరు గ్రామాల్లోని మహిళలు పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ప్రవేశరుసుము రూ.20లు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పోటీలను వడ్డెమాను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు గడిచినందున సోమవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం, పూలమాలతో నివాళులర్పిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంజాద్‌అలీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి నాలుగేళ్లు గడిచినందున కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆశల రబీ

- రెండో పంటగా వరి సాగుకే మొగ్గు
- ఇప్పటికే 15 వేల ఎకరాల్లో పంట సాగు
- మరో 10 వేల ఎకరాల్లో వేయనున్న రైతులు


ట్రాక్టరుతో దుక్కి దున్నుతున్న దృశ్యం


వరినాట్లు వేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: రబీలో భాగంగా మళ్లీ వరి పంట సాగు చేయడానికే రైతులు మొగ్గు చూపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట దిగుబడులు, ధర ఆశాజనకంగా ఉండడమే ఇందుకు కారణం. జలాశయాల్లో నీరు సమృద్ధిగా ఉండటం, రబీ పంటకు నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో నాట్లు జోరుగా సాగుతున్నాయి. కేసీకెనాల్, తెలుగుగంగ, చెరువుల, గాలేరు కింద రైతులు వరి పంట సాగు చేస్తారు.

షుగర్‌లెస్ ధాన్యం సాగు..

రబీలో షుగర్‌లెస్ ధాన్యాన్ని సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో కూడా ఈ ధాన్యం 75 కిలోల బస్తా రూ.1600- రూ.1,800 వరకు పలికింది. ఇప్పుడు కూడా ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొందరు వరి నాట్లు వేశారు. మరికొందరు నాట్లు వేయడానికి ట్రాక్టర్లతో దుక్కులు దున్నడం, నారు తరలించడం లాంటి పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే సుమారు 15 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇంకా 10 వేల ఎకరాల్లో వరిసాగు చేయనున్నారు. ప్రస్తుతం షుగర్ లెస్ ధాన్యం బస్తా ధర రూ.1850 పైగా పలుకుతోంది. త్వరలో రూ.2వేలకు పెరిగే అవకాశముందని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

కలిసొచ్చిన ఖరీఫ్..

రైతాంగానికి ఖరీఫ్‌లో వరి సాగు కలిసి వచ్చింది. గత రెండేళ్ల నుంచి వివిధ కారణాలతో ఇబ్బందులెదుర్కొన్న వారికి ఈ ఏడాది అనుకూలంగా మారింది. ఖరీఫ్‌లో నంద్యాల సోనా, కర్నూలు సోనా వంటి రకాలు సాగు చేశారు. గత ఏడాది నంద్యాల సోనా రూ.1300 పలికితే, ఈ ఏడాది రూ. 1500 నుంచి రూ.1700 వరకు ఆరంభంలోనే లభించింది. అంతే కాక పంట దిగుబడులు కూడా ఎకరాకు 40 బస్తాల వరకు వచ్చాయి. తెగుళ్ల తక్కువగా ఉండడంతో పెట్టుబడి తగ్గింది. దీంతో రైతులకు ఊరట కలిగింది.

నారు కొసలను తుంచి నాట్లు వేసుకోవాలి



కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించడానికి నాట్లు వేసేటప్పుడు నారు కొసలను తుంచి నాట్లు వేసుకోవాలి. దీని వల్ల కాండం తొలుచు పురుగు గుడ్లను నాశనం చేయవచ్చు. నాట్లు వేసే ముందు నారును క్లోరిఫైరిపాస్ ద్రావణంలో 14 గంటల పాటు ఉంచి నాటుకోవాలి. దీని వల్ల 20 నుంచి 30 రోజుల వరకు కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశముండదు. – స్వాతి, ఏఓ, బండిఆత్మకూరు

వాసవీమాతకు వైభవంగా మహాభిషేకం



వజ్రాల చీర అలంకరణలో వాసవీ మాత, పుష్పాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ వాసవీ దీక్షా మండలి ఆధ్వర్యంలో వాసవీ మాతకు మహాభిషేక కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి 108 కలశాలతో చెరువు కట్ట నుంచి గంగా జలాన్ని కేరళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి మూలమూర్తి అమ్మవారిని అభిషేకించారు. అలాగే వివిధ ఫలాలతో, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకం చేపట్టి, వజ్రాల చీరతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి వివిధ పూలతో అభిషేకం జరిపించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పట్టణంలో గ్రామోత్సవం చేపట్టారు. మండలి అధ్యక్షుడు ఇనుగూరి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అయ్యపురెడ్డి రాఘవేంద్ర, భవనాశి వాసు, ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.

బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తేనే సీమ అభివృద్ధి


మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): రాయలసీమ అభివృద్ధి జరగాలంటే సంగమేశ్వరం వద్ద ఐకాన్ వంతెనకు బదులు బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే, రాయలసీమ స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నందికొట్కూరు పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంగమేశ్వరం వద్ద రూ.1,200 కోట్ల వ్యయంతో ఐకాన్ వంతెనకు బదులు కేవలం రూ.700 కోట్లతో బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే 70 టీఎంసీల కృష్ణాజలాలను నిల్వచేసుకునే వెసలుబాటు కలుగుతుందన్నారు. బ్రిడ్జి కం వంతెన సాధనకు ఈ నెల 28న సంగమేశ్వరం వద్ద రాయలసీమ ప్రాంత ప్రజాప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, బీజేవైఎం నాయకులు మద్దిలేటి, రాంబాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి తోరణం

రహదారికి ఇరువైపులా విస్తరించిన చింత చెట్ల కొమ్మలు

పాములపాడు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మండలంలోని యర్రగుడూరు గ్రామం వద్ద చింత చెట్ల కొమ్మలు గొడుగు పట్టినట్లుగా విస్తరించాయి. రహదారికిరువైపులా ఉన్న భారీ చింత చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగి ఒక దానికొకటి అల్లికలా కలిశాయి. దీంతో రోడ్డుకు ప్రకృతి అల్లిన పచ్చని తోరణంలా దర్శనమిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. ఎన్నో సంవత్సరాల క్రితం నాటిన ఈ చెట్లు చాలా చోట్ల నేలమట్టమయ్యాయి. కేవలం యర్రగుడూరు గ్రామం వద్దనే హరిత వర్ణంతో కళకళలాడుతూ నీడనిస్తున్నాయి. వేసవికాలంలో సైతం ఈ ప్రాంతం చల్లగా ఉంటోంది. శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం కాలినడకన వెళ్లే కన్నడ భక్తుల, యాత్రీకులు ఈ చెట్ల కింద సేద తీరుతుంటారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..


లక్ష్మణరావును ఆశీర్వదిస్తున్న వేదపండితులు


ఏఆర్ అడిషనల్ ఎస్పీని ఆశీర్వదిస్తున్న దృశ్యం

మహానంది: రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు మహానందీశ్వరుడికి ఆదివారం పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఏఈఓ మధు, సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం,కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆయన వెంట నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.రాధారాణి, జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన పాల్గొన్నారు. అలాగే..ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు కుటుంబసభ్యులతో కలిసి వచ్చి శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వరుడిని దర్శించుకుని అభిషేకం,కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం వారికి స్థానిక అలంకార మండపంలో వేదాశీర్వచనం చేసి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.

గజ.. గజ..!

- తీవ్రమైన చలితో వణుకుతున్న ప్రజలు
- జిల్లాలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఏడుగంటలైనా బయటికి వచ్చేందుకు జంకుతున్న ప్రజలు


చలిమంటకాచుకొంటున్న ప్రజలు

జూపాడుబంగ్లా: వారం రోజుల నుంచి చలి తీవ్రత అధికం కావటంతో ప్రజలు గజ గజ వణికిపోతున్నారు. ఉదయం ఏడుగంటలైనా ఇళ్లల్లోంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. సాధారణ ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ నుంచి 30 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటుంది. 18 డిగ్రీల సెల్సియస్ నుంచి 21 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత ఉంటే కొద్దిపాటి చలి ప్రారంభం అవుతుంది. అంతకంటే తక్కువగా 13 డిగ్రీల సెల్సియస్ నుంచి 17 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రత ఉంటే చలి తీవ్రత ప్రారంభమవుతుందని, అంతకంటే తక్కువగా 5 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రత పడిపోతే చలితీవ్రత అధికమవుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

మరో నాలుగు రోజులు చలితీవ్రత

నంద్యాల జిల్లాలో గత వారం రోజుల నుంచి చలితీవ్రత అధికం కావటంతో పాటు ఆదివారం నుంచి మరో నాలుగు రోజుల పాటు చలితీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గిపోవటంతో సాయంత్రం 6 గంటలైతే చాలు చల్లనిగాలులు ప్రారంభం అవుతుండటంతో ప్రజలు ఇళ్లల్లోకి దూరి దుప్పటి కప్పేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి పశువుల పాకలు, ఇళ్లు శుభ్రం చేసుకోవటం పరిపాటి. అలాంటిది గత వారం రోజుల నుంచి తెల్లవారుజామున నాలుగంటలకు నిద్రలేచినా చలితీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మొండిగా చలిలో పనులు చేసుకుంటున్న వారు దగ్గు, జలుబు, చలిజ్వరాలబారిన పడుతున్నారు. చలితీవ్రత అధికంగా ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నవ నిర్మాణ సమితి సేవలు మరువలేనివి


శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ పోచా. చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పీవీ నగర్ రోడ్డులోని మున్సిపల్ హిందూ శ్మశాన వాటిక స్వర్గధామంలో చేస్తున్న అభివృద్ధి పనుల్లో నవ నిర్మాణ సమితి సేవలు మరువలేనివని ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. ఆదివారం స్వర్గధామం అభివృద్ధిలో భాగంగా కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే వైఫైను ప్రారంభించి, 13 అడుగుల శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వర్గధామంలో ఉద్యానవన నిర్మాణానికి తన సొంత నిధుల ద్వారా త్వరలో ఉద్యానవనాన్ని నిర్మిస్తామన్నారు. మరమ్మతులకు గురైన వైకుంఠ రథానికి ఎంపీ సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తారన్నారు. అనంతరం శ్మశాన వాటికలో నూతనంగా ఏర్పాటు చేసిన హస్తికలను భద్రపరిచే రూము, గ్యాస్ ఆధారిత కాల్పుల గదులను, గ్యాలరీలు, హరిశ్చంద్ర ఘాట్, పరిసరాల అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కల్లూరి రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిషా, ఏపీ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, నెరవాటి సత్యనారాయణ, కౌన్సిలర్లు పురందర్, సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్లు కత్తిశంకర్, భీమునిపల్లె సుబ్బయ్య, సమితి సభ్యులు డాక్టర్ మధుసూదనరావు, గుంటూరు ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి, గెలివి రామకృష్ణ, శేషుబాబు పాల్గొన్నారు. అలాగే.. సమితి సభ్యురాలు, ప్రముఖ స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ నాగమణి తన జన్మదినాన్ని స్వర్గధామంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ పని చేస్తున్న సేవకులు 50 మందికి ఒక నెల సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయినులకు సన్మానం


ఉపాధ్యాయినులను సన్మానించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): భారత తొలి ముస్లిం ఉపాధ్యాయిని ఫాతిమా షేక్ 192వ జయంతిని పురస్కరించుకొని జమాతే ఇస్లామి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను ఆదివారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మహిళా విభాగం కన్వీనర్ బేగం అమ్తుసలాం మాట్లాడుతూ ఫాతిమా షేక్ దేశంలో మత సామరస్యానికి ముస్లిం మహిళల విద్యాభివృద్ధికి, మహాత్మాజ్యోతిరావు పూలే దంపతులతో కలిసి కృషి చేసిందని చెప్పారు. ఉపాధ్యాయినులు నూర్జహాన్, నజీరున్నిసా, హిల్డా శిషీలియా, మాగజ్వెల్‌లను సన్మానించి మెమొంటో అందజేశారు.

విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు తీసుకోండి


మాట్లాడుతున్న విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు

కర్నూలు(అగ్రికల్చర్): విత్తనోత్పత్తిలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని నంద్యాల ప్రాంతీయ పరిశోధన కేంద్రం విశ్రాంత వ్యవసాయ అధికారి రామరాజు తెలిపారు. ఆదివారం ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సు కింద నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన విత్తనోత్పత్తి, విత్తన ధ్రువీకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలంటే విత్తనం ఎంపిక కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. విత్తనోత్పత్తికి మూల(బ్రీడర్) విత్తనం వాడాలని, దీని నుంచి ఫౌండేషన్ సీడ్ వస్తుందని తెలిపారు. విత్తనోత్పత్తికి ఫౌండేషన్ సీడ్ వినియోగిస్తే దాని నుంచి సర్టిఫైడ్ సీడ్ వస్తుందన్నారు. విత్తనంలో జన్యు స్వచ్ఛత, తేమ తగిన స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు. విత్తన ఉత్పత్తిలో ఐసోలేషన్ దూరం, కలుపు యాజమాన్యం తదితర వాటిని పాటించాలని సూచించారు. రైతులకు విత్తనోత్పత్తిపై తగిన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌పుట్ డీలర్లతో పాటు దేశీ శిక్షణా కార్యక్రమం సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య పాల్గొన్నారు.

నేడు శ్రీశైలం రానున్న పాండిచ్చేరి ముఖ్యమంత్రి

శ్రీశైలం: శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం సోమవారం ఉదయం పాండిచ్చేరి ముఖ్యమంత్రి రామస్వామి శ్రీశైలం రానున్నారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకోనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఆయన బందోబస్తు కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు.

20 నుంచి భక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర 5వ భక్తి సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.జి.శరత్ చంద్రబాబు తెలిపారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 20 నుంచి 22వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే సమ్మేళనంలో 18 మంది స్వామీజీలు, రాష్ట్రంలో ఉన్న రామకృష్ణ సేవా సమితిల ప్రతినిధులు, సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ సమ్మేళనానికి కన్వీనర్‌గా శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఎస్ఆర్‌కేవీబీపీపీ) రాయలసీమ కన్వీనర్ డాక్టర్ పి.పి.వి.డి. నాగత్రిశూల పాణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పాణ్యం: కొత్తూరు శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం దాతలు విరాళం అందించారు. నంద్యాల పట్టణానికి చెందిన దండే పెద్ద వెంకటసుబ్బయ్య, వెంకట సుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు దండే శ్రీనివాసులు రూ.77,777 నగదును ప్రధాన అర్చకుడు నారాయణస్వామికి అందించారు. ప్రస్తుతం ఆలయంలో మహాప్రాకారం, భక్తులు సౌకర్యార్థం ప్రత్యేక విడిది ఏ ర్పాటు పనులు జరుగుతున్నట్లు అర్చకుడు తెలిపారు.

ఉద్యోగాల సాధనతో గుర్తింపు

నంద్యాల(అర్బన్): ఉన్నత చదువు, ఉద్యోగాల సాధన ద్వారానే అంధులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని, అంధులు ప్రతి చైతన్యవంతంతో సమాజానికి, కుటుంబానికి మంచిపేరు తెచ్చే పనులు చేయాలని నవనంది రోటరీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. లూయిస్ బ్రెయిలీ జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్థానిక స్వామి వివేకానంద ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాటాడారు. అనంతరం డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు, దస్తగిరిరెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రాజశేఖర్, క్రాంతి చైతన్య, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అంధులకు ట్రైసైకిళ్లు అందజేశారు. అంధుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుర్రప్ప, ఓబులేసు, మస్తాన్‌వలి బహుమతులు పంపిణీ చేశారు.

షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలి


రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్న జిల్లా షూటింగ్ బాల్ జట్టు

కర్నూలు (టౌన్): ఈ నెల 14వ తేదీ కృష్ణా జిల్లా విజయవాడ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల్లో రాణించాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు అతిథులుగా హాజరైన వీరిరువురు క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులుగా ప్రతిభ చాటే వారికి ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం ఉందన్నారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, నాగరాజు, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): అంబేడ్కర్‌ను అవమానించిన రాయలసీమ యూనివర్సిటీ సూపరింటెండెంట్ ఎండీ ఇస్మాయిల్‌ను కఠినంగా శిక్షించాలని సీపీఐ, బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకులు రఘురామ్మూర్తి, రమేష్, బీఎస్పీ నాయకులు లాజరు, స్వాములు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా అసభ్యకర పదజాలంతో మాట్లాడిన ఇస్మాయిల్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించి, అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనతరం ర్యాలీగా వెళ్లి పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ ఎన్వీ రమణకు ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాదు, పుల్లయ్య, చిన్నరత్నం, దావీదు, జాన్, రాజేష్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కొత్తపల్లి క్రీడాకారుడు


ఎస్.రవికుమార్

కొత్తపల్లి: జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు ఎస్.రవి ఎంపికయ్యాడు. ఆదివారం అతనిని మండల కేంద్రంలోని ప్రజలు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు. గతేడాది శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. ఇతను ఫిబ్రవరి 5 నుంచి ఒడిస్సా రాష్ట్రంలోని పూరిలో జరిగే 44వ జాతీయ స్థాయి సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాడు. నల్లమల అటవీ ప్రాంతం, మారుమూల గ్రామం నుంచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావడం పట్ల అతని తల్లిదండ్రులు సుబ్బలక్ష్మమ్మ, రఘురాముడు ఆనందం వ్యక్తం చేశారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, ఇందుకు నిరసనగా సీపీఎం కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం తెలిపారు. స్థానిక సుదర్శనవర్మ భవనంలో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేస్తుందని, కార్పొరేట్ వర్గాలకు అండగా ఉండి, నిరుద్యోగ సమస్యను తీవ్రం చేస్తుందని మండిపడ్డారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ కనీసం 2లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేక పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రాలకు నిధులు మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. జీఎస్టీ పేరుతో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం అన్యాయమన్నారు. పార్టీ కార్యదర్శి రణధీర్, సురేంద్ర, సంజీవరాయుడు, నరసింహానాయక్, మాబాష,స్వాములు పాల్గొన్నారు.